# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1) **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 7వ కలెక్టర్ల సదస్సు ఈరోజు నుంచి జరగనుంది.**

2) **ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో సముద్రపు నాచు పెంపకంపై అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**

3) **హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టును ఆమోదించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

4) **బాలల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

5) **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 7వ కలెక్టర్ల సదస్సు ఈరోజు నుంచి జరగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు, రేపు రెండు రోజుల పాటు జరిగే సమావేశాలకు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. మెరుగైన పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిపై ఈ సమావేశాల్లో సమీక్ష జరగనుంది. ఇందులో భాగంగా మొదటి రోజు సమావేశంలో స్వర్ణాంధ్ర పది సూత్రాలు, జిల్లాల వారీగా వృద్ధి, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడులు, ఫైళ్ల క్లియరెన్స్ వంటి అంశాలపై చర్చించనున్నారు. పలువురు కలెక్టర్లు తమ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను తెలియజేయనున్నారు.

---

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో సముద్రపు నాచు పెంపకంపై అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర తీరప్రాంతాల్లో సముద్రపు నాచు సాగుకు విస్తృత అవకాశాలపై సంబంధిత అధికారులతో దృశ్య మాధ్యమం విధానంలో అమరావతి నుంచి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్వయం సహాయ సంఘాల మహిళలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం కల్పించేలా సముద్రపు నాచు సాగుపై ఆర్థిక నమూనా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫార్మా, పోషకాహార ఉత్పత్తుల్లో నాచు కీలక ముడిసరుకుగా మారే అవకాశముందని, సముద్ర వనరుల ద్వారా సంపద సృష్టికి ఇది గొప్ప ప్రత్యామ్నాయం అవుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టును ఆమోదించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి నిన్న ముఖ్యమంత్రితో సమావేశమై ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. 38 వేల 595 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఏడు కారిడార్లతో కూడిన రెండో దశ నివేదికను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అందజేశామని, దాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో ప్రయాణికుల సౌకర్యం కోసం మెట్రో విస్తరణ అత్యవసరమని వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేయడానికి కేంద్రం ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు.

---------------------------

బాలల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాకినాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు అభినందన సభలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు బాలల హక్కుల పరిరక్షణపై ఆధారపడి ఉందన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' వంటి పథకాలు, చట్టాల్లో మార్పులతో బాలల హక్కుల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సత్యకుమార్ తెలియజేస్తూ,

వాయిస్..25. సెకన్లు

---------------------------

ప్రకృతి సేద్యం విధానంలో విభిన్న పంటలను పండించడం ద్వారా రైతులకు అధిక ప్రయోజనం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ కొనుగోళ్లపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు సరైన ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండ ప్రాంతంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కొత్త టోల్ ప్లాజాను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి పేర్కొంటూ..

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు అధ్యక్షతన నిన్న ధర్మకర్తల

మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బి.ఆర్ నాయుడు పాత్రికేయులకు వెల్లడించారు. టిటిడి అనుబంధ ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల ఖర్చును 5 వేల రూపాయల నుంచి 10 వేల రూపాయలకు పెంచుతున్నట్లు తెలిపారు. త్వరలో "అక్షర గోవిందం" పేరుతో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

వాయిస్ ..25... సెకన్లు

---------------------------

అకాల వర్షాల నేపథ్యంలో తెలంగాణలో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పలు జిల్లాలలో వర్షాల వల్ల పంట నష్టంపై జిల్లాల కలెక్టర్లతో మంత్రి నిన్న మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సంరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవసరమైన టార్పాలిన్లు తక్షణం అందుబాటులోకి తీసుకురావాలని, తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని మంత్రి సూచించారు.

---------------------------

కర్ణాటక నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఎండ తీవ్రత కొంత తగ్గినప్పటికీ వేడి, ఉక్కపోత కొనసాగుతున్నాయని పేర్కొంది. కర్నూలు జిల్లా తోవిలో 41.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొంది. అలాగే ఈ రోజు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు, పోలవరం జిల్లాలో 4 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, మన్యంవీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి ఈరోజు. మన్యం ప్రజల సంక్షేమం కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన పోరాట యోధుడు, సీతారామరాజు. 1897 జూలై 4వ తేదీన నాటి విశాఖజిల్లాలోని పాండ్రంగి గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ వారితో గొప్ప పోరాటం చేశారు. 1924 మే 7వ తేదీన బ్రిటీష్ అధికారులు ఎక్కుపెట్టిన తుపాకీకి ఎదురొడ్డి, వందేమాతరాన్ని నినదిస్తూ, అతిచిన్న వయస్సులోనే దేశంకోసం ప్రాణాలను అర్పించిన ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరును సంబంధిత అధికారులతో నిన్న సమీక్షించించారు. అనంతరం నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రజలతో ఆమె సమావేశమయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. పలు సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని పురందేశ్వరి అధికారులకు సూచించారు.

=====================